క్లుప్తంగా

నేటి నుంచి భైరవపట్నం లూర్ధుమాత ఉత్సవాలు

మండవల్లి: భైరవపట్నం విచారణ, విజయవాడ మేత్రాసనం భైరవపట్నం లూర్ధుమాత మహోత్సవాలు గురువారం నుంచి 3వ తేదీ వరకు విచారణ గురువులు సుంకర శాంతిరాజు పర్యవేక్షణలో నిర్వహిస్తామని బుధవారం నిర్వాహకులు పేర్కొన్నారు. భైరవపట్నం లూర్ధుమాత మహోత్సవాల విచారణలోని అన్ని గ్రామాల ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులకు మేడే శుభాకాంక్షలు

11వ అదనపు జిల్లా జడ్జి

గుడివాడ టౌన్: కార్మిక దినోత్సవం(మేడే) సందర్భంగా వివిధ వర్గాలకు చెందిన కార్మికులకు గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ జీ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక వర్గాన్ని గౌరవించడానికి న్యాయమైన వేతనం, మెరుగైన పని పరిస్థితి కోసం వారి పోరాటాలను స్మరించుకుంటూ జరుపుకొంటున్న కార్యక్రమమే మేడే అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న రోజువారి సవాళ్లు, ఆర్థికాభివృద్ధి, అందరికి మెరుగైన జీవన ప్రమాణాలు, మారుతున్న పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పనికి తగిన వేతనం, సరిపడా సమయాన్ని మాత్రమే కార్మికులకు కేటాయించాలని, పనిచేసే సమయాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు వారికి తగిన బీమా సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఏదైనా చట్టపరంగా సమస్య ఉన్నప్పుడు మండల న్యాయసేవాధికార కమిటీ గుడివాడ వారిని ఆశ్రయించవచ్చని ఆయన సూచించారు.

10 నుంచి జగన్నాథ కల్యాణోత్సవాలు



ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సహిత శ్రీజగన్నాథస్వామి వారి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయ అర్చకుడు శ్రీనివాసుల వెంకట ఫణికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో రాటను పాతి పూజలు నిర్వహించి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

పెరిగిన వేణుగోపాలుని ఆదాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి వారి ఆలయాల భూముల వేలం ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ఆవరణలో వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 18.5 ఎకరాల మాగాణి భూమిని ఏడాదికి రూ.48 వేలు కౌలు చెల్లించే విధంగా వేలం నిర్వహించినట్లు చెప్పారు. గతంలో ఎకరాకు రూ.26 వేలు మాత్రమే కౌలు వచ్చేదని ఈఓ తెలిపారు. అదేవిధంగా రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 13 ఎకరాల చేపల చెరువుకు వేలం నిర్వహించగా ఎకరాకు ఏడాదికి రూ.1.25 లక్షలు లీజు చెల్లించే విధంగా వేలంలో దక్కించుకున్నట్లు చెప్పారు. గతంతో పోలిస్తే ఎకరాకు రూ.60 వేల వరకు అధికంగా లీజు వస్తుందని ఈఓ తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



పెదమద్దాలి(పామర్రు): క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలో బుధవారం నిర్వహించిన క్రీస్తు సువార్త సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసు క్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని కోరారు. దయ క్షమ శాంతి గుణాలను కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సభలో క్రీస్తు నామాలను గానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, ఆరాధకులు పాల్గొన్నారు.

పండితులకు పంచాంగాల పంపిణీ

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలోని అర్చకులకు ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకటమురళీ కృష్ణ బుధవారం పంచాంగాలను పంపిణీ చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరానికి సంబంధించిన అన్ని రకాల విషయాలను ఇందులో నిగుడీకృతమై ఉన్నాయని అన్నారు. ఈ పంచాంగాలు పండితులకు ఎంతగానో ఉపయుక్తం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం దినకర్ తదితరులకు పంచాంగాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పీవీఎస్‌వీ ప్రసాదరావు, యూటీఎఫ్ కార్యదర్శి లంక నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల పోస్టులు ఖాళీ

- 29 పంచాయతీలకు 12 మంది కార్యదర్శులు
- ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న వైనం
- పెరిగిన పని భారంతో ఇబ్బందులు



మండవల్లి గ్రామ సచివాలయ కార్యాలయం

మండవల్లి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో సరిపడా కార్యదర్శులు లేక పాలన ఇబ్బందికరంగా మారింది. మండలంలో 29 పంచాయతీలకుగానూ 12 మంది మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. అన్ని పంచాయతీలు ఇన్‌చార్జిలతో కొనసాగుతున్నాయి. దీంతో వారిపై అదనపు భారం పడుతోంది. ఒక్కో కార్యదర్శి రెండు, మూడు గ్రామాల బాధ్యతలను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయిలో కార్యదర్శి అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ గ్రామంలో కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారో తెలియక మిగిలిన గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పంచాయతీ కార్యదర్శుల ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండవల్లి, లోకుమూడి, తక్కెళ్లపాడు పంచాయతీలకు ఆర్.గిరిజ, గన్నవరం, కానుకొల్లు, చావలిపాడు, ప్రత్తిపాడు పంచాయతీలకు ఎం కొండలు, భైరవపట్నం, చింతపాడు, అల్లినగరం కే ప్రభాకర్, పెరికెగూడెం, ఉనికిలి, పుట్లచెరువు, కొర్లపాడు, పసలపూడి, చింతలపూడిలకు ఎస్‌వీ రాధిక, నుచ్చుమిల్లి, మొఖాసాకలవపూడి గ్రామాలకు యు పద్మ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యదర్శులను అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో నియామకం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి



మండలంలోని 29 పంచాయతీల్లో కేవలం 12మంది కార్యదర్శులే ఉన్నారు. దీంతో వారికి పని భారం ఎక్కువై సతమతం అవుతున్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

పసుపులేటి నాంచారయ్య, మండవల్లి

పోస్టుల భర్తీకి చర్యలు



అన్ని గ్రామాల్లో కార్యదర్శుల భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రేడ్–3 పంచాయతీలు అయినప్పటికీ కార్యదర్శులు సరిపడా లేకపోవడంతో గ్రేడ్–5 కార్యదర్శులను నియమించాం.

కే రామలింగేశ్వరరావు, ఎంపీడీఓ, మండవల్లి

సంక్షిప్త వార్తలు

ఘనంగా గంగానమ్మ తల్లి వార్షికోత్సవం

భూషణగుళ్ల(పెదపారుపూడి): మండలంలోని భూషణగుళ్లలో వేంచేసియున్న శ్రీగంగానమ్మ తల్లి 20వ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గంగానమ్మ తల్లికి జలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం తరుపున గ్రామానికి చెందిన సంపంగి శ్రీకాంత్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గుడివాడ పట్టణం 28వ వార్డు చెందిన వైఎస్సార్ సీపీ నేత కొర్నిపాటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



పెదముత్తేవి(మొవ్వ): ఉపాధి హామీ పథకంలో కార్మికుల సమస్యలపై ఈ నెల ఐదవ తేదీన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు పేర్కొన్నారు. మొవ్వ ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పెదముత్తేవి, కొండవరం గ్రామాల్లోని ఉపాధి కూలీలకు బుధవారం ఆయన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మేస్త్రీలు వెంకటేశ్వరరావు, శాంతి, లక్ష్మణ, బాలాజీ, రాజేష్, గంగాభవాని, అర్జునరావు, మరియమ్మ, సురేష్ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

నందివాడ: మండలంలోని పోలుకొండ గ్రామంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైంది. వివరాల ప్రకారం.. గ్రామంలో రాఘవరావుకు చెందిన గడ్డివామిపై ఉన్న వైర్ల వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి 15 ఎకరాల గడ్డి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. గుడివాడ నుంచి ఫైర్ ఇంజిన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

కైకలూరు: మైనర్ బాలిక కనిపించడం లేదంటూ కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు.. కైకలూరు మండలం పందిరిపల్లిగూడేనికి చెందిన నేపాల నాగదివ్యజ్యోతికి ఇద్దరు ఆడపిల్లలు. వీరిలో పెద్ద కుమార్తె ఏడవ తరగతి వరకు చదివి తల్లి వద్ద ఉంటోంది. అయితే మంగళవారం నుంచి ఆ బాలిక కనిపించడం లేదు. మండవల్లి మండలం నుచ్చిమిల్లి గ్రామానికి చెందిన యువకుడు తన కుమార్తెను తీసుకెళ్లినట్లు పోలీసుల ఎదుట బాలిక తల్లి అనుమానం వ్యక్తం చేసింది. నాగజ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా కాళీమాత ఆలయ విగ్రహ ప్రతిష్ఠ



కైకలూరు: స్థానిక కోరుకొల్లు రోడ్డులో కాళీమాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అవాహిత, పంచసూక్త హోమం, గర్త, రత్న, ధాతున్యాసం, నేత్రోన్మీలనం, మహాపూర్ణాహుతి, బలిహరణం, అభిషేకం, కుంభ ప్రోక్షణ అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముట్నూరి ప్రసాద్ శర్మ ప్రతిష్ఠా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ స్థాపక కుటుంబ సభ్యులు, కాళీమాత భక్తులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మకు డీఎన్నార్ దంపతుల పూజలు



కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మకు వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పేటేటి నాగేశ్వరరావు అమ్మవారి ఎదుట ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించి డీఎన్నార్ దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ కొల్లేటికోట పెద్దింట్లమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు పంజా రామారావు, సమయం రామాంజనేయులు, పంజా నాగు, మేడిశెట్టి మహేష్, బలే సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.40వేలు అందజేత



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గ్రామదేవత గంగానమ్మ అమ్మవారు, శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామివార్ల ఆలయాల జీర్ణోద్ధరణకు రూ.40,464ను కొమ్మనబోయిన సోదరులు రవిశంకర్, శరత్‌బాబు, సత్యనారాయణ, శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఈఆర్‌ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్లు వల్లభనేని కృష్ణప్రసాద్, పోలవరపు వెంకట్రావు, వల్లభనేని బుడ్డిబాబు, కొమ్మనబోయిన రాము పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిపోయిన లారీ

తోట్లవల్లూరు: రోడ్డుపై లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిన ఘటన మండల కేంద్రమైన తోట్లవల్లూరులో జరిగింది. స్థానిక యూకో బ్యాంకు వద్ద ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి ఇసుక లారీ అర్ధాంతరంగా నిలిచిపోయింది. లారీ ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపైనే నిలిపేశాడు. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం ఉదయం మెకానిక్‌లు వచ్చి లారీకి మరమ్మతులు నిర్వహించడంతో సమస్య సద్దుమణిగింది.

ఉద్యోగ విరమణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. నాగమల్లేశ్వరరావు గతంలో కలిదిండి ఎంఈఓగా పని చేశారు. అదేవిధంగా ఏపీటీఎఫ్ జిల్లా స్థాయి నాయకుడిగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా దీర్ఘకాలం పని చేసి విద్యార్థుల, తల్లిదండ్రుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావుకు సంబంధించి ప్రధానోపాధ్యాయుడు బీ ప్రభుదాస్, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సామూహిక కుంకుమ పూజలు

కైకలూరు: అక్షయ తృతీయ సందర్భంగా కైకలూరు శ్యామలాంబ దేవాలయంలో బుధవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత పర్యవేక్షణలో కుంకుమ పూజలు చేశారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా అక్షయ తృతీయ సందర్భంగా కైకలూరులో పలు బంగారం విక్రయ దుకాణాలు వద్ద రద్దీ కనిపించింది.

శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయానికి విరాళం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానం ముఖమండపం పునఃనిర్మాణానికి బుధవారం గుడివాడ పట్టణానికి చెందిన పిన్నమనేని రామచంద్రరావు రూ. 10,116లు విరాళం అందజేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రరావును దేవస్థానం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

'హంస' నూతన కమిటీ ఎన్నిక



మొవ్వ: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ హెల్త్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) ఆవిర్భావ కమిటీ ఎన్నికను మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించారు. మొవ్వ తాలూకా కమిటీ ఎన్నిక, ఆవిర్భావ సభను రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కే రామాంజనేయులు, సెక్రటరీగా కొల్లి విజయ కుమారి, జాయింట్ సెక్రటరీ బాపమ్మలతో పాటు ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో హంస అసోసియేషన్ కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగేందుకు ఈ కమిటీ దోహదపడాలని అరవపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో వివిధ ప్రదేశాల నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు హాజరై సంఘీభావం ప్రకటించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొడాలి సురేష్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టీ విజయ సారథి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో వివిధ విభాగాల కమిటీల, నియోజకవర్గ కమిటీల నియామకం జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన దొండపాటి నాంచారయ్య నియమితులయ్యారు. అదేవిధంగా గుడివాడ నియోజకవర్గానికి సంబంధించి యూత్ వింగ్ ఘంటా సురేష్, మహిళా విభాగం మట్టా కమల, రైతు విభాగం పెన్నేరు ప్రభాకరరావు, బీసీ సెల్ చుండూరి చంద్రశేఖర్, ఎస్సీ సెల్ గోవాడ అశోక్, ఎస్టీ సెల్ ధరావత్ వెంకటేశ్వరనాయక్, మైనార్టీ సెల్ షేక్ సంషూర్ హక్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ కొదమాల ఎలైజా, స్టూడెంట్ వింగ్ యార్లగడ్డ మహేష్, పంచాయతీరాజ్ వింగ్ పిన్నమనేని రాఘవేంద్రరావు, ఆర్టీఐ వింగ్ దోనేపూడి సూర్యనారాయణ, వాలంటీర్స్ వింగ్ రాలి సాయికుమార్, గ్రీవెన్స్ సెల్ అగస్త్యరాజు కృష్ణమోహన్, వాణిజ్య విభాగం కుంచపర్తి సాయిరాం, వీవర్స్ వింగ్ శీలం ప్రకాష్, వైఎస్సార్ టీయూసీ ఖండవల్లి వీర వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ వింగ్ దాసరి మహంకాళమ్మ, లీగల్ సెల్ మసిముక్కు నటరాజ్, కల్చరల్ వింగ్ లోయా రాధాకృష్ణ యాదవ్, సోషల్ మీడియా వింగ్ పాగోలు రాఘవ, ఐటీ వింగ్ కుందేటి ఫణీంద్ర కుమార్, దివ్యాంగుల విభాగం వేమూరి నాగ ఆంజనేయులు, డాక్టర్స్ వింగ్ నందూరి ఉమా శంకర్, ఇంటెలెక్చువల్ ఫోరం గుల్లపల్లి చంద్రశేఖర్, ఎంప్లాయీస్ పెన్షనర్స్ వింగ్ రమణకుమార్, బూత్ కమిటీ వింగ్ భట్టిపాటి శ్రీనివాసరెడ్డి, పబ్లిసిటీ వింగ్ ఘంటా శ్రీనివాస్ నియమితులయ్యారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు



జమీగొల్వేపల్లిలో చిన్నారులు వేసిన చిత్ర లేఖనాలు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు



కైకలూరుశాఖ గ్రంథాలయంలో చిన్నారులకు క్విజ్ పోటీలు



గుడివాడలో కాగితంతో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. బుధవారం విద్యార్థులకు కాగిత బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారి పీ శాంతి తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రతిరోజు ఒక కొత్త అంశంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): మండల పరిధి జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం చిన్నారులకు చిత్ర లేఖనంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందమైన చిత్రాలను గీశారు. అనంతరం గ్రంథాలయ అధికారి వీ నాగ సురేష్ మాట్లాడుతూ సహజత్వాన్ని ప్రతిబింబించేలా చిత్ర లేఖనం ఉండాలని అన్నారు. విద్యార్థుల్లో మనో వికాసం, సృజనాత్మకతకు చిత్ర లేఖనం దోహదపడుతుందన్నారు. అనంతరం చిత్ర లేఖనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ మాధవి, పీ పద్మావతి, పీ వెంకట ధర్మారావు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్ ఆడించామని గ్రంథాలయ అధికారి ఎం ఝాన్సీరాణి పేర్కొన్నారు. అంతేకాకుండా మ్యాథ్స్‌లో ఫార్ములాస్‌ను నేర్పించామని తెలిపారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు నీతి కథలు బోధించడంతో పాటు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో మిత్ర భేదం, మిత్ర లాభం పుస్తకాలకు సంబంధించిన నీతి కథలను విద్యార్థులకు బోధించారు. అదేవిధంగా క్యారమ్స్, చదరంగం, ఇతర ఆటల పోటీలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో బుధవారం గ్రంథాలయాధికారులు పీవీవీ పద్మజ, వాణి వేసవి విజ్ఞాన శిబిరాలతో పిల్లలకు కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ శిబిరాల్లో ఆటల పోటీలు, కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి కథలు, చిత్ర లేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు.

కైకలూరు: కైకలూరు, కలిదిండి మండలం కలిదిండి, కోరుకొల్లు శాఖ గ్రంథాలయాల్లో చిన్నారులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, క్విజ్, చిత్ర లేఖనం, ప్రముఖ విప్లవ కవి శ్రీరంగం శ్రీనివాస్‌కు నివాళి వంటి కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. గ్రంథాలయాధికారులు శ్రీనివాస్, రమేష్‌బాబు, రాఘవులు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంపొందించుకోవడానికి వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

పునీత జోజప్ప జీవితం కార్మిక లోకానికి ఆదర్శం



విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న ఆర్సీఎం చర్చి

గుడ్లవల్లేరు: కార్మికులారా ఏకం కండి! అన్న నినాదం ఏసుక్రీస్తు జీవితంలో నుంచే వెలువడింది. ప్రభువును పెంచిన తండ్రి కార్మిక పునీత జోజప్ప. ఆయన కార్పెంటర్‌గా జీవితమంతా పని చేశారు. కథోలికులు జోజప్పను కార్మికునిగా మే ఒకటిన గుర్తించారు. 1963లో స్థాపించిన గుడ్లవల్లేరు ఆర్సీఎం చర్చిలో ఏప్రిల్ 22 నుంచే జోజప్ప పండుగలు జరుగుతున్నాయి. చర్చి ఫాదర్ మ్యాథ్యూ మాటల్లో.. ప్రపంచమంతా అన్ని దేశాల్లో ఆర్సీఎం చర్చిల్లో ఈ జోజప్ప పండుగ వేడుకలను జరుపుకొంటారు. జిల్లాలోనే ప్రత్యేకంగా జోజప్ప పండుగను ఈ చర్చిలోనే తొమ్మిది రోజుల పాటు భారీగా జరుపుతున్నాం. మే ఒకటిన జరిగే పునీత జోజప్ప భారీ ఊరేగింపు, దివ్యబలి పూజతో ఈ పండుగలు ముగియనున్నాయి. వేలాది మంది ఏసు విశ్వాసులు ఈ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకొంటారు. ఈ చర్చి కింద 30గ్రామాల వరకూ ఉన్నాయి. ఆయా ప్రాంతాల విశ్వాసులకు స్థానికంగా చిన్నపాటి ఆర్సీఎం చర్చిలున్నాయి. ఈ భారీ చర్చికి విద్యుద్దీపాలంకరణ అందర్నీ ఆకర్షిస్తుంది. ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలతో పాటు వేలాది మంది విశ్వాసులు ఒకేచోట ఏసు ప్రసాదాన్ని స్వీకరిస్తారని ఫాదర్ మ్యాథ్యూ తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థిని శాన్వీని సన్మానిస్తున్న సర్పంచ్ ఏసుబాబు

పెదమద్దాలి(పామర్రు): పదవ తరగతి పరీక్షల్లో 400 మార్కులు దాటిన విద్యార్థులకు పెదమద్దాలిలో బుధవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలు వీరమాచనేని వెంకటేశ్వరరావు, రాధారాణిలు మాట్లాడుతూ మండలంలో ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించామన్నారు. జమీగొల్వేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం టీ ఉషారాణి, పాఠశాల పీడీ రవిబాబు, స్కూల్ సిబ్బంది, స్థానికులు పీబీ శ్రీనివాసరావు, శేషగిరిరావు, రత్తయ్య, మృదుల, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కైకలూరు: పది పరీక్షల్లో పశ్చిమగోదావరి జిల్లాలో రెండో స్థానం సాధించిన కొల్లి శాన్వీని కలిదిండి మండలం చినతాడినాడ గ్రామ పంచాయతీ వద్ద బుధవారం సర్పంచ్ గండికోట ఏసుబాబు, వార్డు సభ్యులు సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన శాన్వీ పశ్చిమగోదావరి జిల్లా ఆకీవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి పది పరీక్షల్లో 590 మార్కులు సాధించిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు కొల్లాటి శ్రీను, సంగాని మునలయ్య, విద్యార్థిని తండ్రి నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.75వేలు విలువైన ఇత్తడి తొడుగులు బహూకరణ



దాతను సన్మానిస్తున్న ఆలయ ఈఓ ప్రసాదరావు

జురువరం(పామర్రు): మండలంలోని జురువరంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గడపలకు దాత జన్ను శోభన్‌బాబు, వీర విజయకుమారి దంపతులు సుమారు రూ.75 వేలు విలువైన ఇత్తడి తొడుగులను బుధవారం బహూకరించారు. ఆలయంలోని స్వామివారి గర్భాలయంలో, రాజ్యలక్ష్మి అమ్మవారి అంతరాయంలోని గుమ్మానికి ఇత్తడి తొడుగును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ ఈఓ ప్రసాదరావు స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించారు. స్థానికులు కొండ, వత్తుమిల్లి రంగారావు, ఆలయ అర్చకుడు సత్యనారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.